సాక్షి
కుమురం భీం

మంగళవారం : 4 : జూన్ : 2024



'ప్రాణహిత'కు దక్కని గౌరవం

ప్రాణహిత నదికి తగిన గౌరవం లభించడం లేదు. తగిన గౌరవం, ఆదరణ కల్పించడంతో పాటు పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు. 8లో▸



విత్తనంపై అవగాహన..

విత్తనాల కొనుగోలుపై గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఎరువులైనా, విత్తనాలైనా రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
39.5 /28.6

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గినా ఉక్కపోత కొనసాగుతుంది. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'మోడల్' ప్రవేశాల ఎంపిక జాబితా విడుదల

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ ఆరో తరగతి ప్రవేశాల ఎంపిక జాబితా విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 7న నిర్వహించిన అర్హత ప్రవేశ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా రోస్టర్ ప్రకారం వంద మంది విద్యార్థులను ఎంపిక చేశామని పేర్కొన్నారు. ఎంపిక జాబితాను పాఠశాలలోని నోటీసు బోర్డుపై అందుబాటులో ఉంచామన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 5 నుంచి 7వ తేదీలోగా ఒరిజినల్ టీసీ, బోనఫైడ్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలు, రెండు సెట్ల జిరాక్సులతో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు. హాజరు కాని విద్యార్థుల అడ్మిషన్ రద్దవుతుందని ఆయన స్పష్టం చేశారు.

'పది' సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో సోమవారం పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు పరీక్షకు 325 మంది విద్యార్థులకు 266 మంది హాజరయ్యారు. 59 మంది గైర్హాజరయ్యారని డీఈవో అశోక్, పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు తెలిపారు. కాగా జిల్లాలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ కోసం కేవలం మూడు కేంద్రాలు మాత్రమే ఏర్పాటు చేశారు. జైనూర్, లింగాపూర్, తిర్యాణి, కెరమెరి, వాంకిడి మండలాల విద్యార్థులు జిల్లా కేంద్రానికి రాగా.. పెంచికల్‌పేట్, దహెగాం, చింతలమానెపల్లి మండలాల విద్యార్థులు కాగజ్‌నగర్, కౌటాల, బెజ్జూర్ మండలాల విద్యార్థులు సిర్పూర్(టి)లో ఏర్పాటు చేసిన కేంద్రంలో పరీక్ష రాశారు. ఒక్కొక్కరు 25 నుంచి 45 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి రావడంతో ఇబ్బందులు పడ్డారు.

మెరుగైన వైద్యమందించాలి

జైనూర్(ఆసిఫాబాద్): మారుమూల గ్రామాల్లోని గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్యమందించాలని జిల్లా అదనపు వైద్యాధికారి మనోహర్ అన్నారు. మండలంలోని ఉషేగాం ప్రభుత్వ ఆస్పత్రిని సోమవారం సందర్శించారు. రికార్డులు పరిశీలించి, రోగులకు అందుతున్న చికిత్స వివరాలు తెలుసుకున్నారు. వైద్యాధికారి రాజు, సిబ్బంది ఉన్నారు.

నేడే తీర్పు

- 'ఆదిలాబాద్'లో లోక్‌సభ ఓట్ల లెక్కింపు
- మూడు కేంద్రాల్లో కౌంటింగ్ ప్రక్రియ
- 114 టేబుల్స్.. 157 రౌండ్లు
- ఉదయం 9 గంటల లోపు తొలిరౌండ్ ఫలితం
- జిల్లా కేంద్రానికి చేరిన యంత్రాంగం, అభ్యర్థులు
- మరికాసేపట్లో తేలనున్న విజేత



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల ఓట్ల కౌంటింగ్ సమయం ఆసన్నమైంది. పోలింగ్ ముగిసి 22 రోజులవగా.. ఉత్కంఠకు నేడు తెరపడనుంది. ఈవీఎంలలో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యం మరికాసేపట్లో వెల్లడికానుంది. ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించనున్నారు. అధికారులు ఇప్పటికే అన్ని పూర్తి ఏర్పాట్లు చేశారు. ఉదయం 8గంటలకు ప్రక్రియ ప్రారంభం కానుండగా 8.45 నుంచి 9గంటల వరకు తొలి రౌండ్ ఫలితం వెల్లడయ్యే అవకాశముంది. బరిలో నిలిచిన అభ్యర్థులతో పాటు నిర్మల్, ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల అధికార యంత్రాంగమంతా ఇప్పటికే ఆదిలాబాద్‌కు చేరుకున్నారు. దీంతో జిల్లా కేంద్రంలో సందడి నెలకొంది. కౌంటింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మూడంచెల పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మూడు చోట్ల కౌంటింగ్

ఈ పార్లమెంట్ పరిధి నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోనే నిర్వహిస్తున్నారు. ఎంపీ సెగ్మెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. జిల్లాల వారీగా మూడు చోట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

- ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును టీటీడీసీలో చేపట్టనున్నారు.
- నిర్మల్ జిల్లాకు సంబంధించి నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాల ఓట్లను సంజయ్‌గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో లెక్కిస్తారు.
- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో చేపట్టనున్నారు.
- ఈ మేరకు మూడు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. ఈవీఎంలను ఉంచేందుకు అవసరమైన టేబుళ్లతో పాటు కౌంటింగ్ ప్రక్రియకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అల్యూమినియం తీగలతో కూడిన జాలీలు బిగించారు. నిరంతర నిఘా ఉండేలా సీసీ కెమెరాలు అమర్చారు. అభ్యర్థులతో పాటు వారి ఏజెంట్లు కూర్చునేందుకు కుర్చీలను సమకూర్చారు. వెలుతురు స్పష్టంగా ఉండేలా హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. వీటితో పాటు ప్రతీ కేంద్రంలో మీడియా సెంటర్ అందుబాటులో ఉంచారు.

కౌంటింగ్ తీరు ఇలా..

పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పోలైన ఓట్లను లెక్కించేందుకు ఆరు నియోజకవర్గాలకు గాను 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశారు. అత్యధిక పోలింగ్ కేంద్రాలు కలిగిన ఆసిఫాబాద్ నియోజకవర్గానికి మాత్రం 16 టేబుళ్లను కేటాయించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 14,601 పోలవ్వగా వాటి లెక్కింపు కోసం ప్రత్యేకంగా కౌంటింగ్ హాల్‌ను సిద్ధం చేశారు. ఇందు కోసం 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. టేబుళ్ల వారీగా నంబర్లు వేయడంతో పాటు రౌండ్ వారీగా ఫలితాలు ప్రకటించేందుకు వీలుగా ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంల ఓట్ల లెక్కింపు ఉదయం 8గంటల నుంచి ప్రారంభించనున్నారు. అసెంబ్లీ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రం 1నుంచి క్రమ సంఖ్య వారీగా చివరి పోలింగ్ కేంద్రం వరకు ఈవీఎంలను లెక్కిస్తారు. ఒక్కో టేబుల్‌పై మైక్రో అబ్జర్వర్, కౌంటింగ్ సూపర్‌వైజర్, మరో అసిస్టెంట్ ఉంటారు. లెక్కింపు ప్రక్రియ ఆద్యంతం నిఘా నీడలో కొనసాగుతుంది. చివరగా 17సీ ఫాంను పరిశీలించి పోలైన ఓట్లను సరిచూశాక నియోజకవర్గంలోని అన్ని టేబుళ్లపై అభ్యర్థులకు వచ్చిన ఓట్లను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారికి తెలియజేస్తారు. ఏఆర్వో ఆ నియోజకవర్గంలో రౌండ్‌ల వారీగా వచ్చిన ఓట్లుగా పరిగణించి ఎన్నికల సంఘం పోర్టల్‌లో నమోదు చేస్తారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షి షా టీటీడీసీ కేంద్రంలో అందుబాటులో ఉండి రౌండ్‌ల వారీగా అభ్యర్థులకు వచ్చిన ఓట్లు, మెజార్టీ వివరాలను వెల్లడించనున్నారు. మిగతా కేంద్రాల్లో ఏఆర్వోలు కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తారు. గెలుపొందిన అభ్యర్థికి రిటర్నింగ్ అధికారి ధ్రువీకరణ పత్రం అందజేస్తారు.

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధి వివరాలు		
అసెంబ్లీ నియోజకవర్గాలు: 7	మొత్తం ఓట్లు: 16,50,175	పోలైన ఓట్లు: 12,21,563
కౌంటింగ్ కేంద్రాలు : 3	లెక్కింపులో పాల్గొనే సిబ్బంది : 443	తుది ఫలితం వెల్లడయ్యే సమయం : సాయంత్రం 4గంటలు

ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలు, లెక్కించనున్న ఓట్లు, అందుకు అయ్యే రౌండ్ల వివరాలు..

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	లెక్కించే ఓట్లు	రౌండ్లు
సిర్పూర్	320	1,63,944	23
ఆసిఫాబాద్	356	1,71,511	23
బోథ్	306	1,65,157	22
ఆదిలాబాద్	292	1,81,136	21
ఖానాపూర్	309	1,62,101	23
నిర్మల్	306	1,85,168	22
ముధోల్	311	1,92,546	23



ఉదయం 9 గంటలకల్లా తొలిరౌండ్ ఫలితం

ఉదయం 8 గంటలకు ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుండగా 8.45 నుంచి 9గంటల వరకు తొలిరౌండ్ ఫలితం వెల్లడయ్యే అవకాశముందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షి షా తెలిపారు. ఒక్కో రౌండ్‌కు 45 నిమిషాల సమయం పట్టే అవకాశముంటుందని పేర్కొన్నారు. సిర్పూర్, ఆసిఫాబాద్, ఖానాపూర్, ముధోల్ నియోజకవర్గాలకు సంబంధించి 23 రౌండ్లలో ఓట్ల లెక్కింపు కొనసాగనుంది. అలాగే ఆదిలాబాద్ 21 రౌండ్లు, నిర్మల్, బోథ్ నియోజకవర్గాలకు సంబంధించి 22 రౌండ్లలో ఓట్లను లెక్కించనున్నారు. మొత్తంగా 114 టేబుళ్లలో 157 రౌండ్లుగా ఓట్ల లెక్కింపు కొనసాగనుంది. ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపును ఉదయం 8గంటలకు ఏకకాలంలో ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 2గంటల వరకు విజేత ఎవరో తెలిసిపోనుంది. సాయంత్రం 4గంటల తర్వాతే అధికారికంగా ఫలితాన్ని వెల్లడించే అవకాశముంటుందని అధికారులు చెబుతున్నారు.

కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు

- 1,100 మంది పోలీసులతో గట్టి భద్రత
- ఎస్పీ గౌస్ ఆలం



మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. జిల్లా కేంద్రంలోని కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసు అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1100 మంది సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఐలవ్ ఆదిలాబాద్ సెల్ఫీ పాయింట్ నుంచి మావల పోలీసుస్టేషన్ వరకు సామాన్యులకు అనుమతి లేదని పేర్కొన్నారు. అలాగే కౌంటింగ్ ముగిసిన తర్వాత ర్యాలీలు, సభలు నిర్వహించేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు మద్యం షాపులను మూసి ఉంచనున్నట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రంలోనికి ఎంపీ అభ్యర్థులు, ఏజెంట్లు, పాస్‌లు ఉన్నవారికి మాత్రమే అనుమతి ఉంటుందని చెప్పారు.

కౌంటింగ్‌కు తరలివెళ్లిన సిబ్బంది



సిబ్బందితో మున్సిపల్ కమిషనర్

ఆసిఫాబాద్‌అర్బన్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మంగళవారం నిర్వహించే పార్లమెంట్ ఓట్ల లెక్కింపు కోసం ఆసిఫాబాద్‌లోని కలెక్టరేట్ నుంచి సోమవారం సిబ్బంది, కార్మికులు ప్రత్యేక వాహనంలో తరలివెళ్లారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు కౌంటింగ్ ప్రక్రియకు హాజరవుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ భుజంగ్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రం నుంచి 50 మంది మున్సిపల్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది తరలివెళ్లినట్లు వెల్లడించారు.

ప్రజల ఆకాంక్ష నెరవేర్చిన ఘనత బీఆర్‌ఎస్‌దే

- ఎమ్మెల్సీ దండె విఠల్
- జిల్లా కేంద్రంలో తెలంగాణ ఆవిర్భావ ముగింపు వేడుకలు



జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రజల జీవితకాల ఆకాంక్షను నెరవేర్చిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీకే దక్కుతుందని ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ భవనంలో సోమవారం తెలంగాణ ఆవిర్భావ ముగింపు వేడుకలు నిర్వహించారు. ముందుగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రజల కోసం కేసీఆర్ తన ప్రాణాలను సైతం వదులుకోవడానికి సిద్ధమయ్యారని, అలాంటి వారిని చరిత్ర మరువదన్నారు. 1969లో ప్రారంభమైన ఉద్యమం 2001 వరకు సాధారణంగా సాగిందని, టీఆర్‌ఎస్ ఆవిర్భావం తర్వాత ప్రతీ వ్యక్తిలో రాష్ట్ర సాధన ఆకాంక్ష నింపడంలో కేసీఆర్ విజయం సాధించారన్నారు. పదేళ్లలో దేశానికి దారి చూపెట్టిన రాష్ట్రం.. తెలంగాణ కావడం మనకు గర్వకారణమన్నారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ కష్టాలు మళ్లీ ప్రారంభమయ్యాయని ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మెన్ అలీబిన్ అహ్మద్, కెరమెరి జెడ్పీటీసీ ద్రుపదాబాయి, ఎంపీపీలు మర్సుకోల శ్రీదేవి, మోతీరాం, నాయకులు బాబురావ్, భీమేశ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

గుట్కా.. బ్యాన్

- తయారీ, అమ్మకాలపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం
- తనిఖీలు పెంచి.. సరఫరాను కట్టడి చేయడంపై పోలీసుల దృష్టి
- బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించే అవకాశం
- జిల్లాలో నియంత్రణపై అనుమానాలు



చింతలమానెపల్లి: 'గుట్కా తినడం ఆరోగ్యానికి హానికరం. పొగాకు ఉత్పత్తుల సేవనం ద్వారా ఎన్నో అనర్థాలున్నాయి..' సినిమా థియేటర్లలో స్క్రీన్‌పై ప్రదర్శించే ప్రకటన ఇది. గుట్కాతో కలిగే అనర్థాలపై పలు రకాలు ప్రచారం నిర్వహించినా వినియోగం మాత్రం తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో గుట్కా తయారీ, అమ్మకాలను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో నియంత్రణపై పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు దృష్టి సారించారు.

విచ్చలవిడిగా వినియోగం

జిల్లాలో పాన్‌దుకాణాలు, కిరాణాలు, హోటళ్లు, చిరు వ్యాపారులు, తోపుడు బండ్లు, రైల్వే స్టేషన్లు, బస్‌స్టేషన్లు.. ఇలా అన్నిచోట్ల గుట్కా విక్రయాలు జరుగుతున్నాయి. గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణాలు అనే హద్దులు లేకుండా ఈ వ్యాపారం విస్తరించింది. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పొగాకు, నికోటిన్ కలిగి ఉండే గుట్కా ఉత్పత్తుల విక్రయాలు, వినియోగంపై ఈ నెల 24 నుంచి నిషేధం విధిస్తూ ఆదేశాలు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ డాక్టర్ దాసరి హరిచందన ఉత్తర్వులు జారీ చేశారు. తయారీ, నిల్వ, అమ్మకం, రవాణాలపై పూర్తిస్థాయిలో నిషేధం విధించినట్లు పేర్కొన్నారు. ప్యాకెట్లు, డబ్బాలు.. ఇలా ఏరూపంలో ఉన్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరదాగా మొదలయ్యే ఈ అలవాటు తర్వాత వ్యసనంగా మారుతుంది. చెడు సహవాసాలు, చదువుకు దూరంగా ఉండడం, గుట్కా తినడం ఒక గుర్తింపుగా భావించడం దీనికి కారణాలుగా కనిపిస్తున్నాయి. తోటి వారు తినడంతో గుట్కా, పొగాకు అలవాటు చేసుకుంటున్న వారి సంఖ్య ఎక్కువ. నోటి సంబంధ దుష్ప్రభావాలు, నోటిలో పుండ్లు, క్యాన్సర్లు, ఇతర మానసిక, శారీరక రోగాల బారిన పడే అవకాశాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు.

రూ.లక్షల్లో వ్యాపారం..

జిల్లా వ్యాప్తంగా గుట్కా వ్యాపారం ఒక రోజులో సుమారుగా రూ.50 లక్షలకు పైగా ఉంటుందని అంచనా. సగటున ఒకరు రోజులో సుమారుగా 4 నుంచి 12 వరకు గుట్కా ప్యాకెట్లు వినియోగిస్తున్నారు. ఇది పొగాకు, ఖైనీ, కర్రా, గుట్కా ఇలా పలు రూపాల్లో లభిస్తోంది. గుట్కా కోసం కనీసం ఖరీదును బట్టి రూ.50 పైగా.. ఒక్కొక్కరు రూ.వంద వరకు కూడా ఖర్చు చేస్తున్నారు. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ కేంద్రాలుగా ఉండగా.. అక్కడి నుంచి మండల కేంద్రాలు, ఆపై గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. జిల్లాకు గుట్కాలు ప్రధానంగా హైదరాబాద్, మంచిర్యాల ప్రాంతాల నుంచి, ధరల్లో హెచ్చుతగ్గులను అనుసరించి మహారాష్ట్ర నుంచి కూడా సరఫరా అవుతున్నాయి. మహారాష్ట్రలో గుట్కాలపై నిషేధం గతం నుంచి అమలులో ఉంది. అయితే అక్కడ బ్లాక్ మార్కెట్‌లో తక్కువ ధరకు లభించే గుట్కాలను జిల్లాలో తీసుకువచ్చి అమ్ముతుంటారు. తంబాకు, పొగాకు, కర్ర(మజా, 420 జర్దా పొగాకుతో తయారు చేసేది) మహారాష్ట్ర నుంచే వస్తుంటాయి.

నియంత్రణ సాధ్యమయ్యేనా..

ప్రతీ పల్లెకు విస్తరించి ఉన్న ఈ గుట్కా వ్యాపారం నియంత్రణ సాధ్యమవుతుందా..? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పూర్తిస్థాయిలో అమలైతే ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. పేద, దిగువ మధ్యతరగతి ప్రజలే ఎక్కువగా గుట్కాకు బానిసలుగా ఉన్నారని తెలుస్తోంది. ఈ వ్యాపారం జిల్లావ్యాప్తంగా వేళ్లూనుకుని ఉన్న పరిస్థితుల్లో నియంత్రణ చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం నకిలీ విత్తనాలు, ఎన్నికలు, బందోబస్తు, శాంతిభద్రతల రక్షణలో పోలీసులు తీరిక లేకుండా ఉన్నారు. గతంలో గుట్కాపై నిషేధం విధించినప్పుడు కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ డివిజన్లలో భారీ ఎత్తున నిల్వలు లభ్యమయ్యాయి. రూ.లక్షల విలువైన గుట్కాలు లభ్యమైనా.. ఇతర ప్రాంతాల నుంచి సరఫరా అయినవే ఎక్కువ. నిషేధం విధిస్తే లాభాలు పెరుగుతాయని వ్యాపారస్తులు భావిస్తున్నారు. బ్లాక్ మార్కెట్‌లో కావాల్సిన గుట్కాలు లభిస్తాయని వారు చెబుతున్నారు. గుట్కా తినే వారు ఎంత ధర అయినా వెచ్చించి కొనుగోలు చేస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారి పట్టుబడితే వచ్చే నష్టం కన్నా గుట్కాలను అక్రమంగా విక్రయించడంలో వచ్చే లాభం ఎక్కువ అని వ్యాపారులు బహిరంగంగానే చెబుతున్నారు.

విక్రయిస్తే చర్యలు తప్పవు

ప్రభుత్వం పాన్ మసాలా మినహా మిగతా గుట్కా ఉత్పత్తులపై నిషేధం విధించింది. గుట్కా, ఖైనీ, తంబాకు, అంబర్, పొగాకు వంటి వాటిని విక్రయించడం, వినియోగించడం ప్రభుత్వ నిబంధనల ప్రకారం నేరం. ప్రభుత్వం ప్రవేశపెట్టే నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలి. త్వరలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీటిపై దృష్టి సారిస్తాం.

– రాణాప్రతాప్, టాస్క్‌ఫోర్స్ సీఐ

ఆశ చూపి.. అంటగడుతూ!

- జిల్లాలో యథేచ్ఛగా నకిలీ విత్తనాల విక్రయం
- అధిక దిగుబడి వస్తుందని అన్నదాతలకు అమ్మకం
- మూడు శాఖల సమన్వయంతో అధికారుల తనిఖీలు
- నాణ్యమైన విత్తనం ఎంచుకోవాలని రైతులకు సూచన



చింతలమానెపల్లి మండలం డబ్బా గ్రామంలో పట్టుకున్న నకిలీ విత్తనాలు

కౌటాల(సిర్పూర్): ప్రభుత్వం నకిలీ విత్తనాల కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. పంట సాగులో కీలకమైన విత్తన ప్యాకెట్లపై క్యూఆర్ కోడ్ తప్పనిసరి చేసింది. అయినా దళారులు నకిలీ విత్తనాల దందాకు అడ్డుకట్ట పడటం లేదు. అధిక దిగుబడి ఆశ చూపుతూ అన్నదాతలను మోసం చేస్తున్నారు. జిల్లాలో 3.50 లక్షలకు పైగా ఎకరాల్లో పత్తి సాగవుతుంది. దీనిని ఆసరాగా చేసుకుని నకిలీ దందా ప్రారంభించారు. ఇటీవల ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌తో తనిఖీలు ముమ్మరం చేసిన అధికారులకు విస్తృతంగా నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడుతున్నాయి. రైతులు నాసిరకం విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని డీఏవో శ్రీనివాసరావు సూచించారు. అధీకృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలన్నారు.

రవాణా ఇలా..

ఆంధ్రప్రదేశ్, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన దళారులు పంట సీజన్లకు ముందే కాగజ్‌నగర్, మంచిర్యాల, బెల్లంపల్లిలోని పలు లాడ్జీల్లో బస చేస్తారు. మారుమూల మండలాలైన కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్, సిర్పూర్(టి) తదితర ప్రాంతాల్లో సబ్ ఏజెంట్లను నియమించుకుంటారు. వివిధ రాష్ట్రాల నుంచి నకిలీ పత్తి విత్తనాలు, నిషేధిత గడ్డి మందును ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టులు, కొబ్బరిబొండాల రవాణా లారీల్లో.. ప్రాణహిత నది నుంచి పడవ ద్వారా దిగుమతి చేస్తున్నారు. సరిహద్దులోని దళారులు గోదాంలు కూడా ఏర్పాటు చేసుకుని నిల్వ చేస్తున్నారు. రాత్రి, వేకువజామున వాహనాల్లో ఆయా మండలాల్లోని సబ్ ఏజెంట్లకు సరఫరా చేసి, అక్కడి నుంచి రైతులకు అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ దందా ఏటా కొనసాగుతున్నా కేవలం చిన్న మొత్తంలో కొనుగోలు చేసి విక్రయిస్తున్న వారిని మినహా అసలు సూత్రధారులను పట్టుకున్న దాఖలాలు లేవు.

నిరంతర నిఘా..!

రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించడంతో కొద్దిరోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. అన్నదాతలు సాగు కోసం చేలు సిద్ధం చేసుకుంటున్నారు. విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో నకిలీ విత్తనాలు పోలీసులకు భారీగా పట్టుబడుతున్నాయి. సరిహద్దు మండలాల కేంద్రంగా ఈ దందా సాగుతున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయ, పోలీస్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో తనిఖీలు చేపడుతున్నాయి. విత్తన దుకాణాలతోపాటు సరిహద్దు ప్రాంతాలపై నిఘా ఉంచారు. ఇటీవల జిల్లాలో రూ.10 లక్షల విలువైన ఐదు క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నారు.

జిల్లాలో కేసులు


- మే 22న చింతలమానెపల్లి మండలం గూడెం మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్న 70 కిలోల నకిలీ పత్తి విత్తనాలను టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. వీటి విలువ రూ.1.50 లక్షలు ఉండగా.. నలుగురిపై కేసు నమోదు చేశారు.
- మే 24 బెజ్జూర్ మండలం సోమినిలో రూ.1.50 లక్షల విలువైన 70 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేశారు.
- మే 26న చింతలమానెపల్లి మండలం డబ్బా సమీపంలో రూ.8.12 లక్షల విలువైన 3.25 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశారు.
- మే 27న క్రితం సిర్పూర్(టి) మండలం భూపాలపట్నంలో ఓ వ్యక్తి వద్ద రూ.50 వేల విలువైన 20 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నారు.
- ఇటీవల చింతమానెపల్లి మండలం దిందా గ్రామంలోని ఓ ఇంట్లో నిల్వ ఉంచిన 10 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకుని ఒకరిపై కేసు నమోదు చేశారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై నిఘా పెంచి కఠిన చర్యలు తీసుకుంటున్నాం. వ్యవసాయాధికారులు, పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా బృందాలు ఏర్పాటు చేశాం. గతంలో ఈ దందాకు పాల్పడిన వారిపై కూడా నిఘా ఉంచాం.

– కరుణాకర్, డీఎస్పీ, కాగజ్‌నగర్

కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత



కుటుంబ సభ్యులకు చెక్కు ఇస్తున్న ఎస్పీ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కుడిమెత జలపతిరావ్ గతేడాది సెప్టెంబర్‌లో గుండెపోటుతో మృతి చెందగా.. సోమవారం బాధిత కుటుంబానికి విడో ఫండ్ కింద రూ.60వేల చెక్కును ఎస్పీ సురేశ్‌కుమార్ అందించారు. జలపతిరావ్ కుటుంబ ప్రస్తుత స్థితిగతులు, వారి పిల్లల విద్యాభ్యాసం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు అండగా ఉంటామని ఆయన భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్, జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు విజయ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం


దగ్ధమైన ఇల్లు, సామగ్రి

కోటపల్లి: మండలంలోని పిన్నారంలో ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఆత్రం చంటక్క అనే నిరుపేద మహిళ ఆదివారం రాత్రి ఇంటి ముందు కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించింది. తెల్లవారుజామున ఇంట్లోనుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో స్థానికులు వచ్చి మంటలు ఆర్పివేసినా అప్పటికే ఇంట్లోని సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. గ్రామస్తులు తహసీల్దార్ మహేంద్రనాథ్‌కు సమాచారం అందించగా ఆర్‌ఐ రాజలింగు పంచనామా నిర్వహించి రూ.50 వేల వరకు నష్టం జరిగి ఉంటుందని అంచనా వేశారు. అనంతరం ఆర్‌ఐ బాధితురాలు చంటక్కకు 25 కిలోల బియ్యం అందించారు.

అనుమానాస్పదంగా యువకుడు మృతి


శ్యాంసుందర్ (ఫైల్)

మందమర్రిరూరల్: పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన మదిరె శ్యాంసుందర్ (30) అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. సోమవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి వాష్‌రూంలోకి వెళ్లిన శ్యాంసుందర్ ఎంతకూ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు డోర్ తొలగించి చూడగా అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. వెంటనే 108కు సమాచారం అందించగా పరిశీలించిన వైద్యసిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన వ్యక్తి (ఫైల్)

మంచిర్యాలక్రైం: స్థానిక రైల్వేస్టేషన్లో సోమవారం ప్రమాదవశాత్తు రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (40) మృతి చెందినట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతుడు కొద్ది రోజులుగా రైలు పట్టాలపై పడి ఉన్న ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకుంటూ ఉండేవాడు. సోమవారం రైలు పట్టాలపై బాటిళ్లు ఏరుకుని ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా బెంగళూర్ నుంచి పాట్నావైపు వెళ్తున్న సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీ గదిలో భద్రపర్చినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. వివరాలకు 8712658596, 8712658605 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

‘ప్రాణహిత’కు దక్కని గౌరవం

- పుష్కర నదిగా పురాణ ప్రాశస్త్యం
- తెలంగాణలో పుట్టి తెలంగాణలోనే అంతర్ధానం
- జీవనదిని పట్టించుకోని పాలకులు
- ప్రత్యేక రాష్ట్రంలోనూ దక్కని గుర్తింపు
- పర్యాటకంగా అవకాశాలు కల్పించాలని డిమాండ్


ప్రాణహిత నది

చింతలమానెపల్లి:అందమైన పరిసరాలు.. ప్రతీ కాలంలోనూ ప్రవహించే నీరు..ఆహ్లాదం అందించే అటవీ ప్రాంతం.. పురాణాల్లో ప్రశస్తి గాంచి పుష్కర నదిగా పేరు పొందిన నది.. వర్షాకాలంలో ఉగ్ర రూపం దాల్చినా అబ్బురపరిచేలా కనిపించే నది.. ప్రాణులకు నెలవుగా పేరు గాంచిన ‘ప్రాణహిత’కు తగిన గౌరవం లభించకపోగా పాలకుల నిర్లక్ష్యానికి గురవుతోంది.

తెలంగాణలో పుట్టి తెలంగాణలోనే ముగింపు

ప్రాణహితకు తెలంగాణలో ఒక ప్రత్యేకత ఉంది. ఈ నది తెలంగాణలోనే పుట్టి తెలంగాణలోనే ముగుస్తుంది. కుమురంభీం జిల్లాలోని కౌటాల మండలం తుమ్మిడిహేటి వద్ద ఈనది జన్మస్థలం. వార్ధా (పెన్‌గంగ), వైనగంగ నదుల సంగమంతో ఈనది జన్మించింది. కుమురంభీం జిల్లా నుంచి మంచిర్యాల జిల్లా మీదుగా కరీంనగర్ జిల్లా సరిహద్దులోని కాళేశ్వరం వద్ద గోదావరితో సంగమిస్తుంది. తెలంగాణలోని కుమురంభీం, మంచిర్యాల, మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలకు సరిహద్దుగా ఉంది. 113 కిలోమీటర్ల దూరంప్రయాణించే ఈనది గోదావరినది జలాలలో 40 శాతం వాటాను కలిగి ఉంది.

పురాణ ప్రాశస్త్యం కలిగిన పుష్కర నది

ప్రాణహిత నది ప్రస్తావన పురాణాలలో ఉంది. ప్రణీత మహాముని పేరు మీదుగా ఈనదికి ప్రాణహిత పేరు వచ్చింది. హైందవ ధర్మం ప్రకారం పుష్కరాలు నిర్వహించే 12 నదుల్లో ప్రాణహిత 12వ నది. పేరుకు తగినట్టుగా ఈనదీ తీరం జీవవైవిధ్యం కలిగి ఉంటుంది. మహారాష్ట్ర, తెలంగాణలోని ఇరు ప్రాంతాల్లో దట్టమైన అటవీప్రాంతాన్ని కలిగి ఉంది. ఈనదీ తీరంలోనే మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలంలో అరుదైన వృక్ష శిలాజాలు, డైనోసార్ అవశేషాలు లభించాయి. పలు రకాల ప్రాణులకు నిలయంగా ఉంది. తుమ్మిడిహేటి వద్ద చపరాడ ప్రశాంతధాం ఆలయం మొదలు కాళేశ్వరం వరకు పలు ప్రసిద్ధి చెందిన దేవాలయాలు ఉన్నాయి. పురాణాల్లో ప్రశస్తి కలిగిన ప్రకారం ఈ నదికి పన్నెండేళ్లకు ఒకసారి పుష్కరాలు వస్తాయి. 2010లో మొదటిసారి, ఆతర్వాత 2022 ఏప్రిల్‌లో పుష్కరాలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి నదిలో మొక్కులు చెల్లించుకున్నారు.


ప్రాణహితకు హారతి ఇస్తున్న స్థానికులు (ఫైల్)


పుష్కరాల్లో ప్రాణహితకు ఇచ్చిన సారె (ఫైల్)

ఆదరణకు నోచుకోని వైనం

ప్రాణహిత నది తెలంగాణలో పుట్టి తెలంగాణలోనే తన ప్రస్థానాన్ని ముగిస్తుంది. ఈ నదికి ప్రత్యేక గుర్తింపు ఇవ్వాల్సి ఉండగా పాలకుల నిర్లక్ష్యంతో ఆదరణకు నోచుకోవడం లేదు. తెలంగాణ కవులు, గేయకారుల ఆలోచనల్లో గోదావరి, కృష్ణా నదులే తప్పా ప్రాణహిత ప్రస్తావన కనిపించదు. గత ప్రభుత్వ హయాంలో 2022లో పుష్కరాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ముందుకు రాలేదు. నామమాత్రంగా ఏర్పాట్లు చేసి చేతులు దులుపుకున్నారు. కుమురంభీం జిల్లా తుమ్మిడిహేటి, మంచిర్యాల జిల్లాలోని అర్జునగుట్ట వద్ద ఏర్పాట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రాణహిత నీటిని కాళేశ్వరం వద్ద ప్రాజెక్టు నిర్మించి పలు జిల్లాలకు తరలిస్తున్నా అప్పటి ప్రభుత్వం పుష్కరాల్లో నిధులు కేటాయించక పోవడంతో విమర్శలు వెల్లువెత్తాయి. గోదావరి, కృష్ణా నదుల పుష్కరాలకు కోట్ల రూపాయలు కేటాయిస్తున్న ప్రభుత్వాలు ప్రాణహితపై చిన్నచూపు చూపడం వివక్షేనని ప్రజలు ఆరోపిస్తున్నారు. జీవనదిగా పేరుగాంచిన ప్రాణహిత నదిని ఎన్నికల అంశంగా మారుస్తూ ప్రాణహిత జీవం తీస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

పర్యాటక గుర్తింపు ఇవ్వాలి

ప్రాణహితకు తగిన గౌరవం కల్పించడంతోపాటు పర్యాటక గుర్తింపు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. తుమ్మిడిహేటి వద్ద ప్రాణహిత మాత విగ్రహాన్ని ఏర్పాటు, పర్యాటకులకు వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. నది పరీవాహకంలోని గిరిజన, వెనుకబడిన ప్రాంతాల్లో పర్యాటక స్థలాలను గుర్తించి స్థానికులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి. కుమురంభీం, మంచిర్యాల జిల్లాలలో పర్యాటకులు సందర్శించేలా ప్రచారం నిర్వహించాలి. ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనైనా ప్రాణహిత నదికి తగిన గౌరవం, గుర్తింపు లభిస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అసెంబ్లీలో ప్రస్తావిస్తా..



ప్రాణహిత నదికి తగిన గౌరవం లభించాల్సి ఉంది. నది తీర ప్రాంతాల్లో గిరిజన, ఆర్థికంగా వెనుకబడిన ప్రజలే ఎక్కువగా ఉన్నారు. సాగునీటి అవసరాలు తీర్చి ఆర్థిక వృద్ధికి ప్రస్తుత ప్రభుత్వం కృషి చేయాలి. నది తీరంలో ప్రాణహిత మాత విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తా. పర్యాటకంగా గుర్తింపునకు అసెంబ్లీలో ప్రస్తావిస్తా.
– పాల్వాయి హరీష్‌బాబు, ఎమ్మెల్యే, సిర్పూర్(టి)

‘హామీల అమలుకు కృషి’

శ్రీరాంపూర్: సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తున్నామని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. సోమవారం ఆర్కే 7 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. పది నెలలుగా పెండింగ్‌లో ఉన్న సీఎంపీఎఫ్ లోన్ సమస్య పరిష్కరించాలన్నారు. సొంతింటి పథకం, ఇంకా ఇతర హక్కుల సాధన కోసం తాము పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీసైదా, ఏరియా కార్యదర్శి మారుపెల్లి సారయ్య, పిట్ సెక్రెటరీ బీర రవీందర్, నాయకులు మురళి చౌదరి, ఆకుల లక్ష్మణ్, రాంచందర్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

‘హర్కర’ను కలిసిన ఉమ్మడి జిల్లా నాయకులు


పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

దండేపల్లి: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, కాంగ్రెస్ పార్టీ ప్రొటోకాల్ చైర్మన్ హర్కర వేణుగోపాల్‌ను తెలంగాణ ఎల్‌పీజీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ ఈసీ సభ్యులు సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయనను కలిసిన వారిలో ఉమ్మడి ఆదిలాబాద్‌కు చెందిన వెంగళరావ్, సత్యనారాయణగౌడ్, సుభాష్‌రావు, తదితరులు ఉన్నారు.

‘కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలి’


చర్చలు జరుపుతున్న అధికారులు

కాసిపేట: దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కంపెనీ గేట్ ఎదుట మృతదేహం ఉంచి నిరసన తెలిపారు. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం... కంపెనీలోని వర్క్‌షాపులో పర్మినెంట్ ఎంప్లాయిగా పనిచేస్తున్న మేకల రాకేష్ (48) గత నెల 28న విధులకు వెళ్తుండగా కంపెనీ ఆవరణలో కాంప్రెషర్ హౌజ్ సమీపంలోని థర్డ్‌ప్లాంట్ మార్గంలో కోతులు దాడి చేశాయి. తప్పించుకునే ప్రయత్నంలో హ్యాండ్‌రేల్ ఫెడస్టాల్ మీద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. ముందుగా కంపెనీ డిస్పెన్సరీలో ప్రథమ చికిత్స చేయించి అక్కడి నుంచి మంచిర్యాలకు, వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సోమవారం కంపెనీ గేట్ ఎదుట ఆందోళన చేపట్టడంతో విషయం తెలుసుకున్న దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు అక్కడికి వెళ్లి వారికి నచ్చజెప్పినా వినకపోవడంతో కంపెనీ అధికారులతో చర్చలు జరిపారు. అన్ని బెనిఫిట్స్‌తో పాటు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు అంగీకరించడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, యూనియన్ నాయకులు తిరుపతిరెడ్డి , స్థానిక నాయకులు మెరుగు శంకర్, రమణ, ఆడె జంగు, వడ్లూరి మల్లేశ్, షాకీర్, తదితరులు పాల్గొన్నారు.

‘ప్రాణహిత’లో మునిగి ఒకరి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాజు

దహెగాం: మండలంలోని రావులపల్లి గ్రామానికి చెందిన కుడ్మెత గోవిందరావు (45) ప్రమాదవశాత్తు ప్రాణాహిత నదిలో మునిగి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి మహారాష్ట్రంలోని తోగులవెంకటాపూర్ క్షేత్రానికి వెళ్లాడు. మొక్కులు చెల్లించిన అనంతరం ఇంటి వద్ద పనిఉందని చెప్పి మధ్యాహ్నం కాలినడకన గ్రామానికి బయలుదేరాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులకు గోవిందరావు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం ప్రాణాహిత తీరంలో శవమై తేలాడు. నది దాటుతున్న క్రమంలో నీట మునిగి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని భార్య కుసుమాంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

పిల్లర్లు ధ్వంసం చేసిన ఒకరి రిమాండ్

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని గోంది గ్రామ శివారులో రిజర్వు ఫారెస్టు కంపార్ట్‌మెంట్ నెం.68లో అటవీశాఖ సరిహద్దు పిల్లర్లను ధ్వంసం చేసిన ఒకరిని రిమాండ్‌కు తరలించినట్లు కాగజ్‌నగర్ ఫారెస్టు రేంజ్ అధికారి రమాదేవి తెలిపారు. మండలంలోని అంకుసాపూర్ గ్రామానికి చెందిన గౌత్రె అర్జున్ నాలుగు పిల్లర్లను ధ్వంసం చేశాడని, అటవీశాఖ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి సిర్పూర్ (టి) న్యాయస్థానంలోప్రవేశపెట్టగా నిందితునికి 11 రోజుల రిమాండ్ విధించినట్లు ఆమె పేర్కొన్నారు.

మంచిర్యాలలో చోరీ


చిందర వందరగా బీరువాలోని బట్టలు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఆర్‌ఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్న వార్ల రాజయ్య ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం రాజయ్య రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. చోరీ జరిగినట్లు భావించి పోలీసులకు సమాచారం అందించాడు. తులం బంగారు నగలతో పాటు, రూ.40 వేలు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించక పోవడం గమనార్హం.

పెరిగిన టోల్ చార్జీలు


వాంకిడి సమీపంలోని సరాండి టోల్‌ప్లాజా

- ఎన్‌హెచ్–363పై పెంపు
- ఆదివారం రాత్రి నుంచి 5 శాతం అధికంగా వసూళ్లు

వాంకిడి: నాలుగు వరుసల జాతీయ రహదారి–363పై టోల్ చార్జీలు పెంచుతూ నేషనల్ హైవే అథారిటి ఆఫ్ ఇండియా ఆదివారం ప్రకటన జారీ చేసింది. ఏప్రిల్ 1 నుంచే పెరిగిన చార్జీలు అమలులోకి తీసుకురావాల్సి ఉండగా ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేశారు. చివరి విడత ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు కొత్త రేట్లు అమలులోకి తీసుకొచ్చారు. మంచిర్యాల జిల్లాలోని శ్రీరాంపూర్ జీఎం ఆఫీసు నుంచి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు గోయెగాం వరకు 92 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల జాతీయ రహదారి–363 నిర్మించారు. మంచిర్యాల జిల్లా మందమర్రి వద్ద, కుమురంభీం జిల్లా వాంకిడి మండలంలోని సరాండి వద్ద టోల్ ప్లాజాలు ఏర్పాటు చేశారు. సరాండి టోల్ ప్లాజాను 5 నెలల క్రితం ప్రారంభించగా, మందమర్రి టోల్ ప్లాజాను అంతకు ముందే ప్రారంభించారు. ఈ రెండింటి మధ్య 60 కిలోమీటర్ల దూరం ఉండగా ప్రస్తుతం పెరిగిన చార్జీలతో వాహనదారులపై అధిక భారం పడనుంది. కొత్త రేట్ల ప్రకారం పాత చార్జీలతో పోలిస్తే 5 శాతం పెరిగినట్లు తెలుస్తోంది. 31 మార్చి 2025 వరకు కొత్తచార్జీలు కొనసాగనున్నట్లు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు గెజిట్ విడుదల చేశారు.

పాత రేట్లు(రూ.లలో)			
వాహనాల కేటగిరీ	సింగిల్ జర్నీ	తిరుగు ప్రయాణం	నెలవారీ పాస్
కారు, జీపు, వ్యాన్	75	110	2,475
లైట్ కమర్షియల్	120	180	3,995
గూడ్స్, మినీ బస్			
బస్సు లేదా ట్రక్	250	375	8,370
త్రీ యాక్సిల్స్ వాణిజ్య వాహనాలు	275	410	9,130
నాలుగు నుంచి ఆరు యాక్సిల్స్	395	590	13,125
ఏడు యాక్సిల్స్ అంతకంటే ఎక్కువ	480	720	15,980
(అధిక బరువు గలవి)			
కొత్త రేట్లు (రూ.లలో)			
కారు, జీపు, వ్యాన్	90	135	2,955
లైట్ కమర్షియల్, మినీ బస్	145	215	4,775
బస్, ట్రక్	300	450	10,005
త్రీ యాక్సిల్స్	325	490	10,915
4–6 యాక్సిల్స్	470	705	15,690
ఏడు లేదా అంతకన్నా ఎక్కువ	575	860	19,105

‘కార్యాలయాల నిర్మాణానికి సహకరించాలి’



మాట్లాడుతున్న టి.శ్రీనివాస్

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్, రాజీవ్‌నగర్‌లలో పార్టీ కార్యాలయాల నిర్మాణానికి ప్రజలు సహకరించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టీ.శ్రీనివాస్ కోరారు. అనేక పోరాటాలు, ఉద్యమాలు త్యాగాలతో కూడిన విప్లవ పార్టీకి జిల్లా కేంద్రంలో కార్యాలయాల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ప్రజలు, అభిమానులు ఆర్థికంగా, వస్తురూపేణా సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బ్రహ్మానందం, చాంద్‌పాషా, శ్రీనివాస్, మల్లన్న, సాజీద్, సాంబన్న, సోమన్న, గణేశ్, తిరుపతి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో మాయమైన నగలు

కాగజ్‌నగర్ రూరల్: బస్సులో ప్రయాణిస్తున్న మహిళ బంగారు ఆభరణాలు మాయం కావడంతో పట్టణ సోమవారం పోలీసులను ఆశ్రయించింది. సీఐ శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం బెజ్జూర్ మండలం రెబ్బెన కొత్తగూడెం గ్రామానికి చెందిన చిలుక సుజాత బెజ్జూర్ నుంచి అహెరి వెళ్లే బస్సులో కాగజ్‌నగర్ బస్టాండ్‌కు చేరుకుంది. బస్టాండ్‌లో దిగిన తర్వాత తన బ్యాగులో చూడగా, అందులో పెట్టిన బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో ఆందోళనకు గురైంది. తాను కూర్చున్న సీటు వద్ద వెదకగా నగలు లభించలేదు. పోగొట్టుకున్న నగల విలువ రూ.1,18,750 ఉంటుందని బాధితురాలు వాపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ తెలిపారు.

అర్లి(టి) వద్ద అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు


రోడ్డుపక్కకు దూసుకెళ్లిన బస్సు

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) సమీపంలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పంటచేలోకి దూసుకెళ్లిన ఘటన చోటు చేసుకుంది. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును వెంటనే నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఆదిలాబాద్ బస్టాండ్ నుంచి భీంపూర్ మండలంలోని కరంజి(టి) వైపునకు 32 మంది ప్రయాణికులతో బస్సు బయలుదేరింది. అర్లి(టి), ఇందూర్‌పల్లి గ్రామాల మధ్యలో రోడ్డుపై ఏర్పడిన గుంతను తప్పించే క్రమంలో బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును చాకచక్యంగా నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. మరికొంత దూరం వెళ్తే బస్సు బోల్తాపడి ప్రమాదం జరిగే అవకాశం ఉండేది. ట్రాక్టర్ సాయంతో బస్సును బయటకు తీశారు. అంతర్రాష్ట్ర రోడ్డు పూర్తిగా గుంతలుగా మారడంతోనే నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని మండల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు జోక్యం చేసుకుని రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

పాలిసెట్‌లో విద్యార్థుల ప్రతిభ

కాగజ్‌నగర్‌రూరల్: సోమవారం వెలువడిన పాలిసెట్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కాగజ్‌నగర్ పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన సిందం సాయిచరణ్ ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 29, వ్యవసాయ రంగంలో 9వ ర్యాంకు, సామల నాగప్రణీత ఇంజనీరింగ్ విభాగంలో 714, వ్యవసాయ విభాగంలో 601 ర్యాంకు, షేక్‌ఖాజాబాబా ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 748 ర్యాంకు సాధించారు. వాసాల పవన్‌సాయి ఇంజనీరింగ్ విభాగంలో 1467, వ్యవసాయ విభాగంలో 800, సెండె అంజలి ఇంజనీరింగ్‌లో 1,769, బంక వాసు ఇంజనీరింగ్‌లో 2,140, వ్యవసాయ విభాగంలో 827వ ర్యాంకు సాధించారు.

కౌటాల: కౌటాల మండలంలోని బోదంపల్లికి చెందిన పెరుగు దేవాజీ, కవిత దంపతుల కుమారుడు సాయిరాం 51వ ర్యాంక్ సాధించాడు.

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం చంద్రవెల్లికి చెందిన ఇరుసుల సమ్మయ్య–శ్రీలత దంపతుల కుమారుడు జశ్వంత్ ఎంబైపీసీ స్ట్రీమ్ రాష్ట్ర స్థాయిలో 249, ఎంపీసీలో 781 ర్యాంక్ సాధించాడు.

తాంసి: మండల కేంద్రానికి చెందిన జింక మహేందర్, ప్రేమల దంపతుల కుమార్తె జింక పల్లవి రాష్ట్ర స్థాయిలో 569 ర్యాంక్ సాధించింది.

పాలిసెట్‌లో జిల్లాలో మూడో ర్యాంకు

కాసిపేట: మండల కేంద్రానికి చెందిన మల్లెత్తుల రాజేశం–సుజాత దంపతుల కుమారుడు సుమంత్ ఎంబైపీసీలో జిల్లాలో మూడో ర్యాంకు, రాష్ట్రంలో 281వ ర్యాంకు సాధించాడు. ఎంపీసీ విభాగంలో సైతం 582వ ర్యాంకు సాధించాడు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నంనూర్ గ్రామానికి చెందిన మాటేటి సత్యవతి–రాజయ్య దంపతుల కుమార్తె అర్చన బైపీసీ విభాగంలో 254, ఎంపీసీ విభాగంలో 477 ర్యాంకు సాధించింది.


సిందం సాయిచరణ్


రాచర్ల సంతోషిణి


పెరుగు సాయిరాం


ఇరుసుల జశ్వంత్


జింక పల్లవి


మల్లెత్తుల సుమంత్


మాటేటి అర్చన